శాస్త్రి) వచ్చినతరువాత మద్రాసు మ్యూజియం లోని అమరావతీ శిల్పాలు, గోలీ (గుంటూరు జిల్లా) శిల్పాలు, ఆంధ్రదేశపు ఇతర శిల్పకళా ఖండాలూ మనకు రావాలి. వాటిని మన మ్యూజియానికి తీసుకురాలేకపోతే మనం మన కళను వదులుకున్నట్టే. వీలయితే లండను బ్రిటిష్ మ్యూజియములోని అమరావతీ శిల్పాలనుకూడా తెప్పించుకోవడానికి ప్రయత్నించాలి. ఈ శిల్పాలే మనకు భారతీయ కళాచరిత్రలో అచంచలమైన స్థానం కల్పించాయి; మన జాతి కళావేత్తల జాతి అని నిరూపించాయి. వీటిని సేకరించి కాపాడుకోవటం మన విధి. ఇటువంటి శిల్ప సంపదకు మనం స్థావరం ఏర్పరచాలి; ముందు మనకు మ్యూజియము చాలా అవసరం. ఆంధ్రకళాభిజ్ఞులూ, కళాభిమానులూ ఇందువిషయమై శ్రద్ధ వహించాలని కోరుతున్నాను.

---

స్కెచ్

# సేవాభాగ్యం

కుకుమళ్ల కామేశ్వరరావు

ఆ విద్యార్థు లిద్దరూ రాజమహేంద్రవరంలో ప్రభుత్వ కళాశాలయందు బి. ఎస్. సి. ఆఖరి సంవత్సరం చదువుతున్నారు. సుందర కృష్ణయ్య, ఫణిశాయి వయస్సులో సమానులు. ఫణిశాయి భాగ్యవంతుని పుత్రుడు. సుందర కృష్ణ సామాన్య సంసారి. మిత్రులిద్దరూ షికారుగా వెళ్లి మ్యూజియం తోటలో కూర్చున్నారు.

"లోకంలో జ్ఞానం దినదినమూ వృద్ధవుతూందోయ్! అనుక్షణమూ శాస్త్రజ్ఞులు కొత్తకొత్త సంగతులు కనిపెట్టేస్తున్నారు. కళారాధకులు కొత్తకొత్త కళాఖండాలను సృష్టించి పారేస్తున్నారు. యంత్రశాస్త్రజ్ఞులు కొత్తకొత్తయంత్రాలను తయారుచేస్తున్నారు. ఓహో! నవీన విజ్ఞానమా! ఓహో నవీన నాగరికతా! ఓహో నవీన ప్రపంచకమా!" అన్నాడు ఫణిశాయి.

"అది సరే! దాని పర్యవసానం?"అని సుందర కృష్ణయ్య చల్లగా ప్రశ్నించేడు.

"జ్ఞానమే ఆనందం! జ్ఞానమే అన్నీ! మనం జ్ఞానాన్ని ఆర్జించాలి! అది స్వయంపూర్ణం!" అన్నాడు ఫణిశాయి.

"జ్ఞానోపార్జనకి సాధనం?" అని సుందర కృష్ణయ్య ప్రశ్న వేశాడు.

"విద్య."

"విద్య ఖరీదు రూపాయణాపైసాలలో చెప్పు సోదరా! కళాశాలలో మునుపటికంటె హెచ్చు జీతాలు వడికేస్తున్నారు. జీతాలు ధనం మెల్లె క్కుతున్నాయి కాని దిగడంలేదు. ధనం సులువుగా ఏ చెట్టునుంచో, ఏ గట్టునుంచో దొరికేది కాదు. కాబట్టి ధనవంతులు ఏ కొద్దిమందో ఉండగా ప్రజాసామాన్యం బీదవారుగా ఉంటున్నారు. కడుపుకి తిండి కట్టడానికి బట్ట లేనివారు మనదేశంలో కోటానుకోట్లమంది ఉన్నారు. అసలు దేశం ఎలాగుందో చూశావా?"అన్నాడు సుందర కృష్ణయ్య.

"అయితే నువ్వేమంటావు?" అని ఎదురు ప్రశ్న వేశాడు ఫణిశాయి.

"నేనేమనడంలేదు. నువ్వు చెప్పు! నువ్వు బి. ఎస్. సి. పాసయి, పైచదువుకి అమెరికా వెళతానంటున్నావు కాదూ? అందుచేత నువ్వు చెప్పు."

"కేవలం జ్ఞానార్జనమే నా ఉద్దేశం" అని అన్నాడు ఫణిశాయి.

"పాపం! ధనార్జన కాదన్నమాటే?"

"ఎంతమాత్రమూ కాదు."

"అయితే జ్ఞానార్జనవల్ల యెవరికి లాభమంటావు?" అని అడిగాడు సుందర కృష్ణయ్య.

"ఏమీ? అందరికిన్నీ." అని ఆశ్చర్యంతో చూశాడు ఫణిశాయి.

"నువ్వు పెద్దచదువు చదువుతావు. పెద్ద ఉద్యోగం చేస్తావు. దానివల్ల ఎవరికి ప్రయోజనము అని నేనడగం?"అని స్పష్టపరిచేడు సుందర కృష్ణయ్య.

"లోకానికి!" అన్నాడు ఫణిశాయి.

"అట్లాగా?" అని నవ్వి సుందర కృష్ణయ్య "ఇప్పుడు దేశంలో గొప్పగొప్ప ప్లీడర్లు, గొప్ప గొప్ప డాక్టర్లు, గొప్ప వ్యాపారస్తులు, గొప్ప ఉద్యోగస్తులు బోలెడంత మందున్నారు. వాళ్లెట్లాగు ఉన్నారో చూడు! ప్రజలెట్లాగున్నారో చూడు!"

"ప్రజలు దరిద్రులుగానే ఉన్నారనుకో!"

"ఉన్నతపదవులలో ఉన్న ఒక్కొక్క మనిషి లక్షలకొద్ది ధనం ఆర్జించుకొంటున్నాడు. గొప్ప పేరుసంపాదించుకొంటున్నారు. అక్కడితో అది చెల్లు! అట్లాగే నీ గొప్పచదువు, నీ గొప్ప పదవి నీకేలాభంకాని ఆంధ్రదేశానికి లాభమవుతుందా? నువ్వు అమెరికా వెళ్ళి పెద్ద డిగ్రీలు సంపాదించుకొనివస్తే, నిన్ను చూసి ఆంధ్రరాష్ట్రం చేతిలో పెడతారా?" అని ప్రశ్నించేడు సుందర కృష్ణయ్య.

"అదెట్లాగవుతుందయ్యా?"

"కాబట్టి ఇక్కడ సమస్యేమిటంటే మనిషి వ్యక్త్యభివృద్ధి కోరుకోడమా? సంఘం, లేక దేశం అభివృద్ధికోరడమా? ఈ రెండు వేరువేరుగా కనబడుతున్నాయి. కాబట్టి నీకు ఇంతగా చెప్పవలసివచ్చింది" అన్నాడు సుందరకృష్ణయ్య.

"నువ్వెన్ని చెప్పినాసరే నేను అమెరికా వెళ్ళి పెద్ద డిగ్రీలు సంపాదించక మానను" అన్నాడు ఫణిశాయి.

"దానికేముంది! వెళ్ళు. కాని నీవంటివాళ్ళు ఇదివరకు చాలామందయేరు. ప్రజాసామాన్యానికి వాళ్ళవల్ల ఏమీ ప్రయోజనం కలగలేదు. వాళ్లేమో పైమెట్లెక్కిపోతున్నారు. జనసామాన్యం ఎప్పటి చోటేఉంది. రేపుపొద్దున్న నీవు అమెరికా వెళ్ళి తిరిగివచ్చినా అంతే జరుగుతుందని కావలిస్తే గట్టిగా కాగితంమీదరాసిస్తాను" అన్నాడు సుందర కృష్ణయ్య.

"నాసంగతేవేరులేవోయ్!" అని ఫణిశాయి, "అయితేమాడు! జ్ఞానంవల్ల, చదువువల్ల మనిషి పాడైతే పోతాడంటావు చివరికి!" అని నవ్వేశాడు.

"ఓరి పిచ్చివాడా! నేనుచెప్పేది కాస్త తలకి పట్టించుకో! మనిషి రెండు తరహాలుగా జీవించవచ్చు. ఒకటి, తన సౌఖ్యం, తన భాగ్యం, తన వృద్ధికోసం జీవించవచ్చు. రెండు సంఘశ్రేయస్సు కోసం జీవించవచ్చు" అన్నాడు సుందర కృష్ణయ్య.

"అయితే ఒకటిచేస్తూ రెండోది చెయ్యడానికి వీలులేదంటావా? ఇప్పుడు నేను పెద్దచదువు చదువుకొని దేశసేవ చెయ్యలేనంటావా?"

"నేననడం లేదు! ఎలాగు చేస్తావో చెప్పు వింటాను."

"శాస్త్రంలో పెద్దపరీక్షనిచ్చి, వచ్చి ఇక్కడ పెద్దఉద్యోగంలో చేరి దేశోపకారం చేస్తాను" అన్నాడు ఫణిశాయి.

"సరే! నీ సంగతట్లాగుంచు. ఒకాయన విదేశాలకి వెళ్ళి పెద్ద డిగ్రీలు సంపాదించివచ్చి, పెద్ద పంచదారమిల్లులో పనిచేస్తున్నాడు. ఆయనకి నెలకి రెండువేలరూపాయలజీతం. ఆయన చేసే దేశసేవ ఏమిటి? అది దేశసేవా, ఆత్మసేవా అని నేనడగడం?" అన్నాడు సుందరకృష్ణయ్య.

"ఆయన పెద్దచదువు చదువుకోడంవల్లే ఆ పని చెయ్యగలుగుతున్నాడు, లేకపోతే నువ్వు, నేను చెయ్యగలముటోయ్?"

"మనం చెయ్యలేము. ఆమాట నిజమే! ఆయన చేస్తున్నాడు. ఆయన చదువువల్ల మనకి కలిగిన మొదటి ఉపకారమేమిటి? కూలినాలిప్రజ మనిషి ఒక్కొంటికి రోజుకి రూపాయి, రెండు తీసుకొని కాలక్షేపం చేస్తూంటే, ఆయన వేలకివేలు జేబులో వేసుకొంటున్నాడు. మన దేశం, నీకు తెలుసుకదా, ఎంత బీదదేశమో! మరి ఆయన ఎంతమంది జీవనానికిసరిపోయేడబ్బు తానొక్కడు జేబులో వేసుకొంటున్నాడో కాస్త ఆలోచించు" అన్నాడు సుందరకృష్ణయ్య.

"అయితే పాశ్చాత్యదేశాలలో పెద్ద పెద్ద జీతాలు లేవంటావా నువ్వు?"

"వాళ్ళకూ పెద్దపెద్ద జీతాలు లేకపోలేదు. వాళ్ళ జాతీయాదాయం ఎంత హెచ్చోచూడు. వాళ్ళ సగటు ఆదాయం ఎంత హెచ్చో గమనించు. మరి మనగతో?"

"మనది బీదదేశమన్నమాట నిజమేలే!"

"మన బీదదేశంలో ఇంతేసి జీతాలిచ్చుకొంటే మనదేశమేమవుతుంది? కొందరు రాజాధిరాజులలాగు జీవిస్తూంటే మరికొందరు కడుపుకిలేక మాడి చస్తున్నారు" అన్నాడు సుందరకృష్ణయ్య జాలితో.

"అయితే నీ అభిప్రాయమేమిటి?" అని ఫణిశాయి తెలియగోరేడు.

"పెద్దపెద్ద శాస్త్రవిద్యలు చదివేవాళ్ళు మన దేశక్షేమం పాటించి తమ జ్ఞానాన్ని దేశసేవకి ఉపయోగించాలి. వారు సామాన్య జీతాలతో తృప్తిపడాలి. ఇప్పుడు అటువంటివి లేకపోవడం వల్ల గొప్ప ఉద్యోగస్తులు దేశోపకారంకంటె దేశాపకారంచేసిన వారవుతున్నారు. కాబట్టి నీవు కూడా విదేశాలకి వెళ్ళి, పెద్ద చదువు చదువుకు వచ్చి మమ్మల్ని ఆర్థికంగా ఉంగతియ్యాలు అని ప్రార్థిస్తున్నాను!" అన్నాడు సుందరకృష్ణయ్య.

"బాగా చెప్పేవు? మనదేశంలో పెద్ద ఉద్యోగి తక్కువ జీతంతో తృప్తిపడే ఆచారం లేదు. ఆర్థికలాభాన్ని గణించకుండా దేశ సేవ చెయ్యడం మామ్మూలు లేదు."

"అట్లాగనకు! సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసైటీ సభ్యులు గొప్పసేవ చేస్తారని అందరూ ఎరిగిన విషయమే! వారేమేనా పెద్ద జీతాలు పుచ్చుకొంటూ రనుకొన్నావా? మన కాంగ్రెసు పెద్దలు ఏమి ధనమాశించి జైలులోపడి చచ్చి బతికేరు? కాబట్టి అటువంటివారు లేరనవద్దు. ఆ జైలులోపడ్డ కాంగ్రెసు పెద్దలే ఇప్పుడు దేశ సారథ్యం వహించేటప్పుడు వెనకటి త్యాగాన్నంతా త్యాగంచేసి పారేశారు."

"అయితే ఎల్లకాలం చప్పిడి జీతాలమీద బతకమనా నీ సలహా?" అన్నాడు ఫణిశాయి.

"ఎల్లకాలం వద్దు. దేశంయొక్క ఆర్థికస్థితి హీనంగా ఉండగా పెద్దపెద్ద జీతాలతోడెయ్యి వద్దు. ఇప్పటిలో అయిదువందలకి మించిన జీత ముండకూడదు. మన ఆర్థికస్థితి బాగుపడుతూంటే అప్పటిప్పటికి తగినట్లుగా మెల్లెక్కవచ్చు. ఇప్పుడుకూడా దేశంలో అటువంటి ఉద్యమం లేకపోలేదు. మదరాసు ప్రభుత్వంవారు ఈమధ్య మూడువందలకంటె హెచ్చు జీతం తెచ్చుకొనే గవర్నమెంటు సేవకుల జీతంలో నూటికి పదిహేన్ను తగ్గించాలని నిబంధన ఏర్పర చేరు. కాని దీనిని ఐ. సి. ఎస్. ఆఫీసర్లు ఒప్పుకో నట్లు తెలుస్తూంది."

"పెద్దవారి సంగతి అట్లాగుంచు. నాన్‌గజిటెడ్ ఆఫీసర్లు ఎంతసేపూ మా జీతాలు హెచ్చించండోయ్!" అని కాకిగోల తప్పితే మరొకటి కదా! శ్రీహరీ!" అన్నాడు ఫణిశాయి.

"నీరు మట్టాన్ని చూసుకొంటుందని ఇంగ్లీషు సామెత. పెద్దపెద్దగవర్నమెంటు ఉద్యోగస్తులంతా పెద్దపెద్దజీతాలు తీసుకొని పనిచేస్తుంటే, పనికి పెద్దజీతమే ఆదర్శం కాబోలు అని, తక్కువ జీతగాళ్లుకూడ పెద్దఅరుపులు అరుస్తున్నారు. సేవాధర్మం లోపించినచోట మానవులు బుద్ధి పెడదారులు పట్టకమానదు. కాబట్టి అదిజీతాలదారి చూసుకొంటూంది." అన్నాడు సుందరకృష్ణయ్య నవ్వుతూ.

"ఇప్పుడు సెంట్రల్ గవర్నమెంటువారుకూడా పెద్దపెద్ద జీతగాళ్లు తమజీతాలు కాస్తో కూస్తో తగ్గించుకొంటున్నారు. ఇండియా ప్రెసిడెంటు, మంత్రులు కొంచెం కొంచెం తగ్గించుకొంటున్నారుకదా?" అన్నాడు ఫణిశాయి.

"నేను చెప్పవలసినమాట నువ్వే చెప్పేశావు. కొంచెం కొంచెం తగ్గించుకోవడంవల్ల మనకి కలిగే పెద్దలాభంలేదు. దేశంయొక్క ఆర్థికస్థితి వృద్ధియే పర్యంతమూ పెద్దజీతగాళ్లందరూ పథ్యపుజీతాలతో కాలక్షేపం చెయ్యవలసిందనే నామనవి" అన్నాడు సుందర కృష్ణయ్య.

"అయితే ప్రైవేటు సంస్థలలో పనిచేసేగొప్ప ఉద్యోగస్తుల మాటేమిటి?"

"వారి జీతాలకికూడా వైవిధంగానే పరిమితి ఏర్పరచి, హెచ్చుధనాన్ని గవర్నమెంటువారు సేకరించి దేశోపయోగ కార్యాలకు వినియోగం చెయ్యాలి. ఈ మోస్తరుగాచేస్తే బీద ప్రజలను పన్నుల భారంతో అణగార్చ నక్కరలేదు. ఇంతకీ చెప్పవచ్చిందేమంటే నువ్వూ పెద్దచదువు చదువుకొని మా పీకలమీదికి లేకు" అని అన్నాడు సుందరకృష్ణయ్య.

"అంటే చదవవద్దనా నీ ఉద్దేశం?" అని ప్రశ్నించేడు ఫణిశాయి.

"అబ్బెఅబ్బె. ఎంతమాత్రమూ కాదు. ఈనాడు పెద్దచదువువల్ల సేవాభాగ్యం. పుష్కలంగా లభించాలని నా ఆశయం!" అన్నాడు సుందర కృష్ణయ్య.

మిత్రుని మాటలను ఫణిశాయి మననం చేసుకొంటున్నాడు. ఆకాశములో తదియ చంద్రకళ దర్శన మయింది. పొద్దుపోయిందంటూ ఇద్దరు మిత్రులూ ఇంటిదిక్కుగా బయలుదేరేరు.